క్లుప్తంగా

పలు కోర్సుల్లో మహిళలకు ఉచిత శిక్షణ

మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని సోని కాంప్లెక్స్‌లో ఎస్. సంజీవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత స్కిల్ ట్రైనింగ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలతో తెలిపారు. టైలరింగ్, బ్యూటిషియన్, మగ్గం వర్కు, జ్యూట్ బ్యాగ్స్‌లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈనెల 14 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఫొటో, ఆధార్‌కార్డ్‌తో సంప్రదించాలని కోరారు. శిక్షణ అనంతరం వారికి బ్యాంకుల నుంచి ముద్రా లోన్స్ కోసం సహకరిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9396161936.

ఎల్‌బీఎస్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తా



లాల్ బహదూర్‌శాస్త్రి నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

బాలానగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ సోమవారం పాదయాత్ర చేపట్టారు. లాల్‌బహదూర్ శాస్త్రినగర్‌లో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లుతోందని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను వివరించారు. త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కంచి భిక్షపతి, శంకర్‌గౌడ్, అఫ్జల్, శ్రీను, ప్రవీణ్, డి. కృష్ణ, యాదగిరి, ఉదయ్, సురేందర్ నాయుడు పాల్గొన్నారు.

పరామర్శ

మోతీనగర్: ఆర్యవైశ్య సంఘం అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు జైని లక్ష్మణ్‌గుప్తా తండ్రి జైని కృష్ణమూర్తి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు సోమవారం కృష్ణమూర్తి పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మణ్ సోదరులు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం, నాయకులు పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్, బొంత హరికృష్ణ, మహమ్మద్ షరీఫ్, బాబా, సి.సుంకన్న, పి. శ్రీనివాసరావు, కాశీనాథాచారి ఉన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం మహోత్సవం



శ్రీరంగనాయక స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు కట్ట సమీపంలో శ్రీరంగనాయకస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో స్వామివారి కళ్యాణాన్ని కనులపండువగా జరిగింది. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 15వ తేదీ తులసీ దళార్చన వంటి పూజలు ఉంటాయన్నారు.

తాగునీరు రోడ్డుపాలు

కూకట్‌పల్లి: వాటర్‌వర్క్స్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పైపులైన్ వాల్వ్‌ల లీకేజీలతో వందలాది గ్యాలన్ల తాగునీరు రోడ్డు పాలవుతోంది. లీకేజీలతో రహదారులపై తాగునీరు కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. రహదారులపై ప్రవహించే నీరు వాహనాల వేగానికి రహదారులపై ప్రయాణించే వారిపైన పడటంతో ప్రయాణికులు అసౌకర్యానికి లోనవుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీ కమాన్ వద్ద మంచినీటి పైపులైన్ ప్రధాన వాల్వ్ లీకేజీ కారణంగా సుమారు వారం రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. నీరు గుంతల్లో నిలవడంతో ఈగలు, దోమలకు ఆవాసంగా మారుతున్నాయని స్థానికులు తెలుపుతున్నారు. అదే విధంగా కలుషిత నీరు సరఫరా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఆస్‌బెస్టాస్ కాలనీ వద్ద వాల్వ్ లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

దివ్యాంగుల పెన్షన్ పెంపుపై హర్షం

ఓల్డ్ బోయిన్‌పల్లి: దివ్యాంగుల సంక్షేమం కోసం రూ.3016 పెన్షన్‌కు అదనంగా మరో వెయ్యి రూపాయలను పెంచి రూ.4016 చేయడం పట్ల ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం డివిజన్ పార్టీ కార్యాలయంలో 50 మంది దివ్యాంగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ మాట్లాడుతూ... దేశంలో ఎక్కడ లేని విధంగా వికలాంగులకు అదనంగా మరో వేయి రూపాయల పెన్షన్‌ను పెంచి వారి జీవితాలలో వెలుగులను నింపడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌గౌడ్, కర్రె జంగయ్య, సయ్యద్ ఏజాజ్, మన్నె ఉదయ్‌యాదవ్, ఇర్ఫాన్, బుర్రి యాదగిరి, మేకల హరినాథ్, పిట్ల రాజు, గడ్డం నర్సింగ్‌రావు, జహంగీర్, మట్టి శ్రీనివాస్, లలితా తదితరులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కృష్ణారావు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్ కమిటీహాల్‌లో కార్పొరేటర్ సబిహా బేగం ఆధ్వర్యంలో సోమవారం అల్లాపూర్ డివిజన్ దివ్యాంగులు అమీర్ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగులతో పాలాభిషేకం చేశారు. దివ్యాంగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.4116 ఫించన్ అందించనున్నట్లు ప్రకటించడటం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం రూ.3వేల ఫించన్ అందించిన ఘనత కూడా బీఆర్ఎస్ ప్రభుత్వానికి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు నూర్ ఖాన్, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, చాంద్‌పాషా, కరీం, ఇస్మాయిల్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సర్వత్రా హర్షం

మూసాపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగుల సంక్షేమం కోసం ఫించన్ పెంచడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. మూసాపేట డివిజన్‌లో దివ్యాంగులు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌లు సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వికలాంగుల అవసరాల కోసం రూ.3016 నుంచి రూ.4016 చేయటం హర్షణీయమన్నారు. గతంలో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు 150 మంది దివ్యాంగులకు వాహనాలను అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జిల్లా గోపాల్, తుకారాం, విష్ణు, ఇనుగంటి రాజు, అరుణ్, వీరాచారి, నరేష్, అశోక్, న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ అధ్యక్షుడు వెంకట్‌స్వామి, చిరంజీవి, రాములు, షణ్ముఖ రావు, దేవయ్య, స్వామి, మల్లేష్, నాగమణి, మల్లికార్జున్, కుందన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులతో కలిసి పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు, శ్రావణ్‌కుమార్

నియోజకవర్గంలో అన్ని రకాల వసతులు సమకూర్చాం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కూకట్‌పల్లి పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఒక వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమ పథకాలను అమలు చేసిన నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం కూకట్‌పల్లి పోలీసులు తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కృష్ణారావు హాజరై జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూకట్‌పల్లి నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. తెలంగాణ రాకముందు నీళ్ల లేక రోడ్లు, ఇతర సదుపాయాలు లేక ఇబ్బందులు పడేవార అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొమ్మిది సంవత్సరాల్లో రోడ్లు, డ్రైనేజీలతో పాటు శాశ్వతంగా మంచినీటి సమస్యను నిర్మూలించామని తెలిపారు. ఐడీఎల్ చెరువు వద్ద వాకర్స్ రన్నింగ్ చేయటం కోసం వాకింగ్ ట్రాక్ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు.

◆ రాబోయే రోజుల్లో 19 కోట్ల రూపాయలతో ఐడీఎల్ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి కోసం ఒక విజన్‌తో ముఖ్యమంత్రి కేసీఆర్ పని చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలబెట్టిన నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, సీఐ సురేందర్ గౌడ్, డీసీలు రవికుమార్, రవీంద్ర, పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.



2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నోడ్యూస్ సర్టిఫికెట్ కోసం ప్రొ.అన్సారీ దీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ నో డ్యూస్ సర్టిఫికెట్ జారీలో వివక్షత చూపుతున్నారని విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్సారీ ఆరోపించారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ప్రవేశద్వారం ఎదుట బైఠాయించి దీక్ష చేపట్టారు. ఆర్ట్స్ కాలేజీ లింగ్విస్టిక్స్ విభాగం నుంచి ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ చేసిన తనకు ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ ఇంత వరకు నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని గత నెల (మే 30న) ఉద్యోగ విరమణ చేసిన వీసీ ప్రొ.రవీందర్‌పై విదేశీ విద్యార్థుల నిధులు దారి మళ్లించారని ఆధారాలతో సహా చూపినా నో డ్యూస్ సర్టిఫికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. పదవులకు ఆశపడి వీసీ ప్రొ.రవీందర్ చెప్పు చేతల్లో పని చేస్తున్న ప్రిన్సిపల్ గణేష్‌కు నేను అన్ని సర్టిఫికెట్లను సమర్పించినా నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఐదు నెలలుగా కళాశాల చుట్టూ తిప్పిస్తున్నారన్నారు .నో డ్యూస్ సర్టిఫికెట్ లేకపోవడంతో ఇంత వరకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పింఛన్ రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల పడుతున్నట్లు పేర్కొన్నారు. నేను గానీ., నా కుటుంబ సభ్యులుగాని అనుకోని సంఘటనలు చేసుకుంటే దానికి ఓయూ వీసీ ప్రొ.రవీదర్ బాధ్యుడని ప్రొ.అన్సారీ హెచ్చరించారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, హెచ్‌ఎం నరేందర్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని కూకట్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను సోమవారం స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా కూకట్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలు అన్ని సౌకర్యాలతో ఎదిగాయన్నారు. అన్ని రకాల సౌకర్యాలతో, మంచి విద్యను అందించే ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన సదుపాయం వంటి అనేక సౌకర్యాలు విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ ప్రభాకర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, ప్రధాన ఉపాధ్యాయులు నరేందర్, సంతోష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దోస్త్ కాలేజీల జాబితాల్లో చేర్చండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో కొనసాగుతున్న నాన్ దోస్త్ కాలేజీలను దోస్త్ జాబితాలో చేర్చాలని ఆయా కాలేజీల ప్రిన్సిపల్స్, కరస్పాండెంట్స్ కోరారు. సోమవారం ఓయూ దూరవిద్య సెమినార్ హాల్‌లో రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, వీసీ ప్రొ.రవీందర్ ఆధ్వర్యంలో నాన్ దోస్త్ కాలేజీల నిర్వాహకుల సమావేశం జరిగింది. నాన్ దోస్త్ జాబితాలోని 61 కాలేజీల్లో డిగ్రీ విద్యార్థులు చేరడం లేదని ఫీజుల విషయంలో కూడా దోస్త్, నాన్ దోస్త్ కాలేజీలకు నడుమ వ్యత్యాసం ఉందని, ఒకే ఫీజు విధానాన్ని అమలు చేయా లని కోరారు. నాన్ దోస్త్ కాలేజీ నిర్వాహకుల అభ్యర్థనను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

మనూలో జాబ్ ఫెయిర్

రాయదుర్గం: విద్యార్థులకు చదువుతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు.సోమవారం ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, గ్యాలెక్సీ ప్లేస్‌మెంట్ సర్వీసెస్ అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్(ఏఎంపీ) ఆధ్వర్యంలో ప్రత్యేక మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. టీపీసీ ఇన్‌చార్జీ డాక్టర్ ఎండీ యూసుఫ్‌ఖాన్ మాట్లాడుతూ 58 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయన్నారు.

సమతానగర్ సమస్యలను పరిష్కరించాలి



కార్పొరేటర్‌తో మాట్లాడుతున్న కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: సమతానగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్‌ను సోమవారం సమతానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. కార్పొరేటర్ నివాసంలో అసోసియేషన్ ప్రతినిధులు కార్పొరేటర్‌ను కలసి సమతానగర్ సమస్యలపై చర్చించారు. సమతానగర్‌లో జనాభాకు అనుగుణంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, కమ్యూనిటీహాల్ పైకప్పు ఏర్పాటు చేయాలని.. రెండు నెలల నుంచి లో ప్రెషర్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ త్వరలో మీ సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నేడు యోగాపై సెమినార్

రాయదుర్గం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మనూలోని ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ తెలిపారు. క్యాంపస్‌లోని సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో మధ్యాహ్నం 12 గంటలకు వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహననగర్‌లో కాలనీ వాసులతో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు సోమవారం పర్యటించి రూ.33 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. సీసీరోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని సూచించారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ కాలనీ, బస్తీలో ఎటువంటి సమస్య లేకుండా పరిష్కారిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీ వాసులు అందే నర్సింహ, రామకోటేశ్వర్‌రావు, హనుమంత్‌రాజు, రామనాథం, రామ సుబ్బారెడ్డి, వెంటక్‌రామిరెడ్డి, వీరేశం, బాబురావు, ప్రకాష్, రామేశ్వర్, సత్యనారాయణ, వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.



శాతవాహననగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

'మెషిన్ లెర్నింగ్'పై అవగాహన సదస్సు

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 26, 28 తేదీల్లో 'మెషిన్ లెర్నింగ్ ఇట్స్ అప్లికేషన్స్ ఇన్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై 3 రోజుల అధ్యాపక వికాసంపై అవగాహన సదస్సు (ఎఫ్‌ఎపీ) నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ మాధవి, ప్రొఫెసర్ మంజునాథాచారి సోమవారం సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లను ఇంజనీరింగ్, టెక్నాలజీకి ఎలా అన్వయించవచ్చో అర్థం చేసుకోవడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలతో పాల్గొనే వారిని సన్నద్ధం చేయడానికి దీనిని రూపొందించినట్లు తెలిపారు. ఈఎఫ్ఎపీని విద్యావేత్తలు, పరిశోధన స్కాలర్లు, బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ చదివే వారికోసం ఉద్దేశించామని,ఆసక్తి ఉన్నవారు ఇతర వివరాలకు డా.రామకృష్ణ (81060 21619)ను సంప్రదించాలని సూచించారు.

ఆకట్టుకుంటున్న వీవజ్ అండ్ క్రాఫ్ట్స్ వస్త్ర ప్రదర్శన





వీవజ్ అండ్ క్రాఫ్ట్స్ వస్త్ర ప్రదర్శనలో కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కూకట్‌పల్లి: శ్రీనగర్‌కాలనీలో సత్యసాయి నిగమాగమంలో వీవజ్ అండ్ క్రాఫ్ట్స్ వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చేనేత ప్రదర్శన నిర్వాహకురాలు శ్రీలత యలమంచిలి మాట్లాడుతూ... వేసవి, వివాహ, ప్రత్యేక సందర్భాల్లో ధరించడానికి అనుగుణంగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రత్యేక కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. వివిధ రకాల చీరలు, డ్రెస్ మెటీరియల్స్ ఆకర్షణీయమైన డిజైన్లతో పాటు నగరానికి చెందిన ప్రముఖ జ్యువెలరీ షోరూం వసుంధర జ్యువెలర్స్ వారిచే బంగారు, వజ్రాల అభరణాలు, హైదరాబాద్ మేలిమి ముత్యాల నగలు మగువలు దోచే విధంగా ఉన్నాయన్నారు.

◆ ఎగ్జిబిషన్ మేనేజర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో ధరించడానికి అనువైన కాటన్ దుస్తులు, వివాహ, ప్రత్యేక సందర్భాలలో ధరించే విధంగా సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్స్‌తో పాటు ఉప్పాడ, కళంకారి, మంగళగిరి, వెంకటగిరి, పోచంపల్లి చీరలు, చందేరి సిల్క్, రాజస్తాన్, హ్యాండ్ బ్లాక్ ప్రింట్ చీరలు, భగల్పూర్ సిల్క్ చీరలు, బెంగాల్ కాటన్ చీరలు, కాశ్మీర్, లక్నోచికన్ చీరలు, బనారస్ చీరలు, కాంతావర్కు చీరలు, డిజైనర్ సూట్స్, బ్లౌజులు, జైపూర్ బెడ్ షీట్లు, బ్లాక్ గాజులు వంటివి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రదర్శన మరో ఈనెల 14 వరకు మాత్రమే కొనసాగుతుందని తెలిపారు.

పార్ట్‌టైం అధ్యాపకులను పర్మనెంట్ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ వర్సిటీలలో పని చేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులను (పీటీఎల్) పర్మనెంట్ చేయాలని ఆయా వర్సిటీల వీసీలకు వినతి పత్రాలు ఇచ్చినట్లు ఓయూ పార్ట్‌టైం అధ్యాపకుల అసోషియేషన్ అధ్యక్షులు డా.సోమేశ్వర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం వీసీ ప్రొ.రవీదర్‌కు వినతి పత్రం ఇచ్చారు. తెలంగాణ మహిళ వర్సిటీ వీసీ ప్రొ.విజ్జులతకు పీటీఎల్ అధ్యక్షురాలు డా.వరలక్ష్మీ ఆధ్వర్యంలో పార్టుటైం అధ్యాపకులు వినతి పత్రాన్ని అందజేశారు.

'తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుంది'

ఓల్డ్ బోయిన్‌పల్లి: గడప గడపకు బీజేపీ భరోసా యాత్ర 13వ రోజుకు చేరుకుంది. బీజేపీ నాయకులు భరోసా యాత్రలో పాల్గొంటూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సోమవారం స్వర్ణదామనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి బీజేపీ మెడ్చేల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, వడ్డేపల్లి శరన్‌కుమార్ చౌదరి ఆధ్వర్యంలో భరోసా యాత్ర కొనసాగింది. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేస్తు బీజేపీకి మద్దతు తెలిపాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎనుగుల తిరుపతి, సంతోష్‌గౌడ్, దర్మరావు, సత్యమూర్తి, రవికుమార్‌గౌడ్, లక్ష్మి, కార్తీక్, తులసి, సాయిచరణ్, చైతన్య, శేఖర్, భగత్, శశికుమార్, సూర్య, మనిష్ తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో బీజేపీ భరోసా యాత్రలో పాల్గొన్న నాయకులు